

# న్యూసెన్స్

గోపాలం పరుపుమీదపడి దొర్లుతున్నాడు పడక కుదరటంలేదు. దోమతెరలోకి కొన్ని దోమలు చేరి నృత్యగానాలతో వినోదిస్తున్నాయి. దిండు కిందనుంచి బ్యాటరీ లైటు తీసి దోమల్ని వెతుకుతున్నాడు. చేతులు చప్పుడవుతున్నాయి. దోమలు తప్పించుకుని పారిపోతున్నాయి. ఒక్క దోమ చిక్కింది. అరచేతిలో రక్తం చిందింది. కసిగా చేతులు నులుముకున్నాడు.

"మేలుకోనన్నా మేలుకోవాలి... నిద్రన్నా పోవాలి... ఏమిటీ గోల... అర్ధరాత్రిపూట... అంకమ్మ శివాలని..." విసుక్కుంది పార్వతి దుప్పటి ముసుగు తీయకుండానే.

"ఇది హైదరాబాదు మహానగరం... బొబ్బర్లంక గాదు..." అన్నాడు గోపాలం.

"ఏమిటో ఆ తేడా... హైదరాబాదు వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోవటం లేదా... పిల్లల్ని కనటం లేదా..."

"సంతోషించాంలే పడుకో..." అన్నాడు గోపాలం గట్టిగా దిండును దులుపుతూ. అతని ముఖం కోపంతో ఎర్రపడింది.

"అదే నేనూ చెప్పేది.....పడుకోండి...." పార్వతి ముఖం సిగ్గుతో కందినట్లయింది.

గోపాలం దోమల్ని హతమార్చే ప్రయత్నంలో "ఠాప్...ఠాప్" అని చప్పట్లు చరిచి ఒక్కసారిగా పడుకున్నాడు. అయినా నిద్రపట్టటంలేదు. గోపాలానికి ఎవరిమీదనో కోపం. అంతులేని కోపం.

చింతలబస్తీలో పెళ్ళి జరుగుతోంది. రోడ్డుమీద పందిరి వేశారు. ట్యూబ్‌లైట్లు పెట్టారు. గ్రామఫోను పాటలు హైదరాబాదు అంతా వినబడేట్లు బిగ్గరగా పెట్టారు. "మెహబూబా...మెహబూబా...ఊఁ...ఊఁ..." అదే రికార్డు మధ్యాహ్నంనుండి పెడుతున్నారు. ఆ పాట తన ఆఫీసుకు కూడా వినబడింది.

పెళ్ళికి వచ్చినవాళ్ళకి వినబడేటట్లుగా మెల్లిగా పెట్టుకోగూడదూ పాటలు? సాయంత్రం ఇంటికి వస్తుంటే కారు నడపటానికి వీల్లేకుండా షామియానా అడ్డంవచ్చింది. కారును అటకాయించారు పెళ్ళివాళ్ళు! పైరోడ్డు వెంబడి తిరిగిపోండి" అన్నారు.

"రోడ్డుమీద పందిరివేసింది కాక... రాకపోకలు నిలపటం మీ ఇష్టమేనా... కారులో పెట్రోలు మీ తాత పోయిస్తాడా..." గోపాలం హారను కొడుతూ కిటికీలోనుంచి బయటకు తొంగిచూసాడు. కుర్రాళ్ళంతా ముందుకు వచ్చారు.

"కారు ఇటునుంచి పోవటానికి వీల్లేదు"

"ఎందుకని?"

"వీల్లేదు... అంతే".

కార్లోంచి దిగి ఆ కుర్రాళ్ళందరినీ రెండు చేతులతో రెండు పక్కలకు లాగేసి, అడ్డంవచ్చిన వాళ్ళను నాలుగు తన్ని, మీసం దువ్వి కారు నడుపుకుని పోదామనుకున్నాడు గోపాలం. వివేకం ఉద్రేకానికి కళ్ళెంలాంటిది. తటపటాయించాడు. తనకు దువ్వటానికి మీసాలు లేవు- రెండోది, వాళ్ళు నలుగురు కలిసి తనను శుభ్రంగా తన్ని కారును ఒక పక్కకు తోసెయ్యవచ్చు. ఆపదలందు ధైర్యగుణమెంత అవసరమో, ఆపద కొనితెచ్చుకోకుండా ఉండటం గూడా గొప్ప నేర్పే.

"కారు... వెనక్కి..."

"కారు... వెనక్కి..."

కుర్రాళ్ళు చప్పట్లతో తాళంవేస్తూ వంతగా పాడుతున్నారు. అందులో ఒకడి గొంతు కీచు. గ్రామఫోను పాటతో కలిపి తారాస్థాయిలో "కారు వెనక్కి... మెహబూబా... మెహబూబా... కారు వెనక్కి... కారు వెనక్కి... ఊఁ... ఊఁ..." అంటూ పాడుతున్నాడు- వాళ్ల ముఖాలు విప్పారి ఉన్నాయి. గోపాలం ముఖం కందగడ్డయింది. వాళ్ళు పాడుతుంటే తనకు ఆవేశం వస్తోంది. అసమర్థుడికి ఆవేశం ఎక్కువ అంటే ఇదే కాబోలు అనుకున్నాడు. ఇంతలోకి ఒక పెళ్ళి పెద్ద వచ్చాడు.

తనకంటె ఒక అడుగు పొడుగెక్కువ ఉంటాడు. హాండిలుబారు మీసాలు. నిజం మీసాలో, అతికించుకున్నవో అన్న అనుమానం వచ్చేట్లుగా నిగనిగలాడుతున్నాయి. గోపాలం అతనివంకే చూస్తున్నాడు- అతను రావటంలో ఉద్దేశం ఏమిటో గోపాలానికి తెలియటంలేదు. నవరసాల్లో ఏ రసమూ అతని ముఖంలో ప్రస్ఫుటం కావటం లేదు. నవరసాలున్నట్లు వాడికి తెలియదేమో! ఎడంచేత్తో కారును ఎత్తి మూడు పిల్లిమొగ్గలు వేసేట్లుగా గిరవాటు వేసి, మాటా మన్నూ లేకుండా తిరిగి వెళ్ళిపోవచ్చు. లేకపోతే తనను కార్లోంచి బయటకు లాగి, టై పట్టుకుని పైకెత్తి షామియానామీదకు గిరవాటు వెయ్యవచ్చు. జాడించి ఒక్క తన్ను తన్నితే తన కారు పెట్రోలు ఖర్చులేకుండా తిరిగి తన ఆఫీసుదాకా వెళ్ళిపోవచ్చు. గోపాలం గుండె చిక్కబట్టుకున్నాడు.

"నమస్తే దొరా" అన్నాడు అతను ముందుకు వచ్చి.

గోపాలం గుండె మళ్లా ఆడటం మొదలుపెట్టింది.

"ఊం." అన్నాడు గోపాలం. నమస్కారం పెట్టటానికేగాని ప్రతి నమస్కారానికి తగినవాడు కాదు ఆ మీసాలవాడు.

"ఈ పోరగాళ్లతో మీకేంటి దొరా.... బిడ్డ లగ్గం ఉంది. పై గల్లీలోంచి పో దొరా."

అతను బ్రతిమిలాడుతున్నాడా... బెదిరిస్తున్నాడా... గోపాలానికి అర్థం కావటంలేదు. ముందడుగే గాని, వెనక చూపులేని గోపాలం కారు వెనక్కు నడుపుకుంటూ ఇంటికి చేరాడు.

"అలగా మూక... అలగా మూక... ఛీ...ఛీ.." గోపాలం బిగ్గరగా సణుక్కున్నాడు. "మెహబూబా...మెహబూబా...ఊం.. ఊం" బిగ్గరగా పాట వినబడుతుంటే గోపాలంగూడా ఆ పాట ముక్కుతో అంటున్నాడు.

"యేమిటా కూనిరాగాలు... అర్ధరాత్రి పూట న్యూసెన్సూ..." పార్వతి ముసుగులోనుంచే విసుక్కుంది.

'న్యూసెన్సు' అన్నమాట వినబడగానే గోపాలం ఉలిక్కిపడ్డట్టుగా లేచి కూర్చున్నాడు. పన్నెండవస్తోంది. అర్ధరాత్రి ఎవరికీ నిద్రపట్టకుండా ఏమిటీ పాటలు... గోల... ఆ గోల ఆపిస్తేనేగాని నిద్రపట్టదు. లేకపోతే పబ్లికు రోడ్డుమీద తన కారు పోనీకుండా వెనక్కు తిప్పిస్తారా... ఎంత గీర వాళ్ళకి! వాళ్ల బ్రతుకులన్నీ కలిసి తన కారు ఖరీదు చెయ్యవు.

దోమతెరలోంచి బయటకు వచ్చి వెంటనే ఫోను తీసి డయలు చేశాడు.

"హల్లో .. పోలీస్ స్టేషన్..."

"యస్సార్".

"ఎవరు మాట్లాడేది?"

"యస్సైని మాట్లాడుతున్నాను"

"చూడు..."

"సార్..."

"నేను... శ్యాంనగర్‌లోనుంచి గోపాలాన్ని మాట్లాడుతున్నాను."

"సార్... జి.యం.గోపాలంగారా సార్?"

"అవును".

"సార్.... గుడ్‌మార్నింగ్ సార్...."

తెల్లవారిందేమోనని గోపాలం కిటికీలోనుంచి బయటకు చూశాడు.

"ఊ... చూడు... ఇక్కడ న్యూసెన్సు కేసు ఉంది... ఇద్దరు కానిస్టేబుల్సుని పంపు."

"సార్.... అట్లాగే సార్. న్యూసెన్స్ ఎక్కడ సార్? మీ ఇంట్లోనా సార్?"

"నో...నో.... చింతలబస్తీలో పెళ్లవుతోంది..."

"అట్లాగే సార్... మరి న్యూసెన్సు ఎక్కడ సార్?"

"అక్కడే పెళ్ళిపందిట్లో..."

"కొట్లాట కాదు... గ్రామఫోను రికార్డులు చెవులు పగిలిపోయేట్లు పెడుతున్నారు.... మేం కాలనీవాళ్ళం... నిద్రపోవాలా అక్కర్లేదా."

"నిద్రపోవాలి సార్."

"ఇద్దరు కానిస్టేబుల్సును పంపి... ఆ పాటలు ఆపించు... న్యూసెన్సు కేసు పెడతానని చెప్పు."

"సార్... ఇప్పుడే బందు చేయిస్తాను సార్."

"మీ పెద్దదొరకు నమస్తే చెప్పు."

"పొద్దున్నే రాగానే చెపుతాను సార్...."

గోపాలం ఫోనుపెట్టి మెల్లిగా మంచం మీదకు వచ్చాడు. పార్వతి "పిలిచారా" అని అడిగింది కళ్ళు నులుముకుంటూ.

"ఇద్దరు కానిస్టేబుల్సును.... పిలిచాను" గోపాలం చివ్వుమని సమాధానం చెప్పాడు.

"మంచిపని చేశారు....ఇంకా నన్ను పిలిచారేమో ననుకున్నాను.. అయినా మనింటికి పోలీసులెందుకు?"

"ఇందాకటినుంచి నిద్రపట్టటం లేదు.... నీకేమన్నా కనిపిస్తోందా...?"

"మాటా... పలుకా...? మీరు నిద్రపోయారో... మేలుకున్నారో... నాకేం తెలుస్తుంది. అయినా తెలియక అడుగుతాను... పోలీసులు వచ్చి మీకేమన్నా జోలపాట పాడతారా?"

"కొంచెం ఆగితే, నీకే తెలుస్తుంది... నా కారును వెనక్కి తిప్పి పంపిస్తారా... దమ్మిడీకి పనికిరారు.. వెధవలు."

"వాళ్ళమీద విరుచుకుపడతారెందుకు... ఆ పెళ్ళి పందిట్లోకి మీరు పోవటం ఎందుకు అసలు... ఆడవాళ్లలో పెద్ద బావగారిలాగా..."

"వాళ్ళ తాతదా రోడ్డు... పందిరివేసి మూసెయ్యటానికి."

"ఏదో పెళ్ళిసందడి.... పందిరి ఎక్కడ వేసుకుంటారుట? మీ తాతలు వాళ్ళకేమన్నా కళ్యాణమంటపాలు కట్టించి ఇచ్చారా?"

"కట్టించి ఇస్తానులే... నేను"

"పొద్దున్నే లేచిం తర్వాత కట్టుదురుగాని...ఇప్పటికి పడుకోండి..." పార్వతి దుప్పటి ముసుగులోనుంచి తల ఒకసారి బయటకుపెట్టి "ఎవరికీ చెప్పేది... పడుకోండి..." అంది గట్టిగా.

గోపాలానికి దోమల సంగీతం, "మెహబూబా...మెహబూబా..." పాట, బ్యాండుమేళం, రణగొణధ్వని అన్నీ కలిపి తన చెవిలోకి ఎవరో గరాటు పెట్టి పోస్తున్నట్లుగా ఉంది. తలనొప్పి. దుప్పటి తీసేశాడు. దిండు తీసి కాళ్ళ కింద పెట్టుకున్నాడు. టార్చిలైటులో బ్యాటరీలు తీసి చూశాడు. దోమలకు తోడు కొన్ని నల్లులుకూడా స్వైరవిహారానికి బయలుదేరినట్లున్నాయి. చేతికి చిక్కినట్లే చిక్కి, నవారు పట్టీలోకి దూరిపోతున్నాయి నల్లులు. పరుపు ఎత్తాడు. నవారు బద్దీలు అటూ ఇటూ జరిపి చూశాడు. ఆ నల్లి ఎటో పోయింది. ఒక్కసారి జీవితంమీద విరక్తి వచ్చినట్లయింది. తన మంచం మీద ఉన్న ఒక్క నల్లిని పట్టుకోలేనివాడు జీవితంలో ఏం సాధిస్తాడు? దగ్గర్లో సముద్రం ఉంటే పోయి దూకేసేవాడేమో!

గ్రామఫోను రికార్డు సంగీతం హఠాత్తుగా ఆగిపోయింది. తుఫాను వెలిసినట్లయింది. 'అమ్మయ్య' అనుకున్నాడు. అంతులేని శాంతస్వభావం అతన్ని ఆవరించింది. 'వెధవ నల్లి'

పోతే పోయిందిలే అనుకున్నాడు. అయినా మంచంమీది నల్లి ఎక్కడికి పోతుంది? ఇవ్వాళ కాకపోతే రేపు చిక్కుతుంది. నాలుగు గంటలన్నా గాఢంగా నిద్రపోతే రేపు ఆఫీసుకు పోవటానికి తేలిగ్గా ఉంటుంది. పక్క సర్దుకుని, దిండుకింద టార్చిలైటు పెట్టుకుని ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నాడు.

"అయిదింటికల్లా లేపు..." అన్నాడు గోపాలం పార్వతితో.

"అసలు మీరు నిద్రపోతేగదా లేపే సమస్య...." అంది పార్వతి.

"టెలిఫోను చేసేసరికి.... ఆ పోలీసువాళ్లు వచ్చి గ్రామఫోను ఆపించారు. చూశావా...లేకపోతే ఏమిటి న్యూసెన్సు..."

"అయ్యో రాత... మీ పలుకుబడి బాగానే సద్వినియోగం అవుతున్నది.... పెళ్ళి పందిట్లో పాటలు ఆపించారు.... మీకు పెళ్ళిళ్ళు ఆపించే అధికారం లేదు.... నయం..." పార్వతి మాటలు పూర్తికాకుండానే మళ్ళా రికార్డు మొదలయింది. "గుల్‌బహారోంమే నికలా...అబితుం ...ఊం...ఊం... మెహబూబా... మెహబూబా..." పార్వతి నవ్వుకుంటూ లేచి కూర్చుంది.

"మీ పలుకుబడి బాగానే ఉన్నది... నిజంగా పాటలు ఆపేశారేమోనని భయపడ్డాను సుమా..." అంది.

గోపాలం తేలుకుట్టినవాడిలా లేచి మంచం దిగాడు.

"అక్కడికి పోయి రికార్డు ఆపించి వస్తాను."

"అర్ధరాత్రి ఎందుకు వచ్చిన గొడవ గాని... నిద్రరాకపోతే పోనీండి... చక్కగా కబుర్లు చెప్పుకుందాం... మన పెళ్ళిరోజు మీకు జ్ఞాపకం ఉందా."

"ఎందుకు జ్ఞాపకం లేదూ.... అట్లాగే రికార్డులు పెట్టారా..."

"అప్పుడీ సినిమా రాలేదు గదండీ..."

"వీళ్ల మరీ మితిమీరిపోతున్నారు... ఇప్పుడే అయిదు నిమిషాల్లో వస్తానుండు..." గోపాలం చొక్కా వేసుకుని, చెప్పులు తొడుక్కుని టార్చిలైటు తీసుకుని హుటాహుటిగా బయలు దేరాడు.

"సిరికిం చెప్పడు... అన్నట్లు అట్లా వెళ్ళిపోతున్నారేమిటి కత్తీ...డాలూ తీసుకుని వెళ్ళరా..."

"పార్వతీ...టూ మచ్‌గా మాట్లాడకు."

"నామీద ఎగురుతారేమిటండీ... మీ ఆఫీసులో గుమాస్తానా... పడి ఉండటానికి..."

"గుమాస్తావిగారు... నా ప్రాణానికి బాస్‌లాగా ఉన్నావు...."

"పోనీ ఒప్పుకున్నారుగా...ఆ చొక్కా, చెప్పులు అక్కడ పడేసి చెప్పిన మాట విని వెనక్కు వచ్చేయండి."

"అదేం కుదరదు... ఆ రికార్డు ఆపిస్తేనేగాని... నా మనస్సుకు శాంతి లేదు పార్వతీ."

"భలే...సినిమా డైలాగు భలే చెప్పారు."

"నీ కట్లాగే ఉంటుంది...నాకెంత చికాకుగా ఉందో నీకు తెలియదు"

"ఎందుకొచ్చిన వాదన కానీండి. అక్కడకు వెళ్ళిన తర్వాత...ఏం అవసరం పడుతుందోగాని... వెళ్లేటప్పుడు టెలిఫోను గూడా తీసుకుని పొండి."

"నీ సలహాలేం అక్కర్లేదు."

గోపాలం పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ మర్రిచెట్టు పక్కనందులోనుంచి

అడ్డదారినపోయాడు. అంత చిన్న సందులోనుంచి గాడిద ఒకటి ఎదురు వచ్చింది. పక్కకు తప్పుకున్నాడు. అది ఆగిపోయింది. తను బయలుదేరితే అది బయలుదేరుతోంది. గోడకు ఆనుకుని మెల్లిగా దాని తన్నులు తినకుండా సందు బయటకు వచ్చాడు. 'అమ్మయ్య' అనుకున్నాడు. "ఈ గాడిద ఎదురు వచ్చిందేమిటి...? దీనికీ నిద్రపట్టలేదేమో..." అనుకున్నాడు.

పెళ్ళిపందిరి అంతా రణగొణధ్వనితో నిండిపోయింది. ఆడ, మగ అందరూ ఒకళ్ళను ఒకళ్ళు రాసుకుంటూ పోతున్నారు. చెవిలో ఏవో రహస్యాలు బిగ్గరగా చెపుతున్నారు. ముహూర్తం వేళ సమీపిస్తున్నట్లుంది. రికార్డులు పెట్టే కుర్రాడు గుంజకానుకుని కొద్దిగా కునుకు తీస్తున్నాడు. పాట బిగ్గరగా వచ్చినప్పుడు కొద్దిగా ఉలిక్కిపడుతున్నాడు. వాడి దగ్గరకు పోయి పాటలు ఆపేద్దామనుకున్నాడు. పోలీసులు వచ్చారా... లేదా? వాళ్ళకోసం పందిరి అంతా గాలించాడు. పందిరిలో ఒకపక్కంతా కుర్చీలు వేశారు. రెండో పక్క కింద జంపఖానాలు పరిచారు. అక్కడ ఇద్దరు పోలీసులు గోడకానుకుని కూర్చున్నారు. ఏదో ఫలహారం చేస్తున్నట్లున్నారు. పాటలు ఆపించమని పంపిస్తే ఇదా వీళ్ళు చేసే పని? కొరకొర చూశాడు. గోపాలం రావటం అక్కడ జనంలో కొంత సంచలనం కలిగించింది. అతన్ని గుర్తుపట్టినవాళ్ళు పెళ్ళి దగ్గరకు పోయి చెప్పారు. పెళ్ళి పెద్ద ఇంకా నలుగురిని పోగేసుకుని గోపాలం దగ్గరకు పరుగెత్తుతున్నట్లు నడుస్తూ వచ్చాడు.

"పెద్దదొర... పెళ్ళికి వచ్చాడు..." ఆ మాట అడవిమంటలా క్షణాల్లో పందిరంతా పాకిపోయింది. ఒకళ్ళు అత్తరు తెచ్చి ముంజేతికి పూశారు. గంధం ఇస్తే అరిచేతులకు పూసుకుని వాసన చూశాడు.

దోమ చచ్చిన వాసన పోయి సుగంధం గుబాళించింది.

"దొరకు ఫలారం తెండి..."

పళ్ళెంలో లడ్డూ... బూంది... మంచినీళ్ళ గ్లాసు ప్రత్యక్షం అయ్యాయి.

"అబ్బే... వద్దు..."

"దొర మా ఇంటికొచ్చిండు... ఫలారం చెయ్యకపోతే ఊకుంటామా..." గోపాలం అతనివంక చూశాడు. తను ఫలారం చెయ్యకపోతే ఊరుకునేట్లు లేడు ఆ మీసాలవాడు. లడ్డూ తీసుకుని మెల్లిగా తినటం మొదలెట్టాడు.

"చాయ్... ఎక్కడే... జల్దీ... ఉరకండి..."

వాడు అటు పరుగెత్తేలోపునే ఎవరో గ్లాసులో టీ తెచ్చారు. ఇంతలోకి ఒక పురోహితుడు మంగళసూత్రాలతో అక్షింతలు తెచ్చి ఇచ్చాడు. లడ్డూ పళ్ళెంలో పెట్టి అక్షింతలు తీసుకున్నాడు. టార్చి చంకలో పెట్టుకుని టీ గ్లాసు అందుకున్నాడు. ఏది ముందో ఏది వెనకో తెలియటం లేదు. గబగబా అందరూ అక్షింతలు చల్లుతున్నారు. మంగళసూత్రాలు తెచ్చిన పురోహితుడు కొబ్బరి ఆకులతో కట్టిన కల్యాణమంటపంవైపు పరుగెత్తుతున్నాడు.

"ఉండండహె..." అంటూ పెళ్ళి పెద్ద అందరినీ సర్దుతున్నాడు. లడ్డూ బాగానే ఉందిగాని తినటానికి కుదరటం లేదు. పళ్ళెంలో ఉండిపోయింది. టీ గ్లాసు బాగా కాలుతోంది. కింద పెట్టటానికి చోటు కనిపించటం లేదు. టార్చిలైటు చంకలో జారిపడిపోయేట్లుంది. అందరూ అక్షింతలు చల్లుతుంటే, తనూ చల్లాడు. లడ్డూ తీసుకుని తినాలనిపించింది గాని, కొంచెం టీ

తాగింతర్వాత తింటే బాగుండేట్లుగా లేదు. ఎవరన్నా చూస్తారేమో!

మీసాల పెళ్ళిపెద్ద వచ్చి "దొరలు... మా బిడ్డ పెళ్ళికి వచ్చారు... చాలా సంతోషం దొరా..." అన్నాడు.

"ఆ పోలీసుల్ని ఇట్లా పిలు."

పోలీసులు వచ్చి శాల్యూట్ చేశారు.

"ఆళ్ళు చెప్పారు దొరా... బందోబస్తుకని మీరు టెలిఫోను చేసి చెప్పారుట."

గోపాలానికి ఏం అనాలో తోచలేదు.

"ఆ... మీరు గూడా ఫలహారం చేశారా...?" గోపాలానికి లడ్డూ అంతా తినలేదన్న బాధ పైకి తొంగిచూస్తోంది.

"లగ్గానికి వస్తే ఫలారం పెట్టమా దొరా."

గోపాలానికి నవ్వు వచ్చింది. కళ్ళల్లో ఒక్కసారిగా నీళ్ళు తిరిగాయి. మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఇంటికి వచ్చాడు.

"క్షేమంగా తిరిగివచ్చారు కదా... అదే పదివేలు..." అంది పార్వతి తలుపు తీస్తూ.

"ఆహా..." అతని పెదిమలు మెల్లిగా "మెహబూబా... మెహబూబా..." అంటూ పాడుతున్నాయి.

"మీ న్యూసెన్సు కేసు ఏమైంది?" అంది పార్వతి.

"న్యూసెన్సు ఎవరిదో అంతుబట్టలేదు..." అన్నాడు గోపాలం తలుపు వేసి వస్తున్న పార్వతిని దగ్గరకు తీసుకుంటూ.

"దీంట్లో అంతుబట్టని ధర్మసూక్ష్మం ఏముంది? మీ బుద్ధి మరీ పెద్దదవటంవలన ఈ సూక్ష్మాన్ని వెంటనే తెలుసుకోలేకపోయింది గాని..." అంది పార్వతి. "మెహబూబా... మెహబూబా..." అన్న రికార్డు మళ్ళా బిగ్గరగా వినిపిస్తోంది. గోపాలం పార్వతి చేతులు పట్టుకుని "మనకు గూడా డాన్సు వస్తే ఎంత బాగుండేది...?" అన్నాడు. "డాన్సు అట్లా కాదు... నేను నేర్పుతాను పదండి" అంది పార్వతి దోమతెరవైపు దారితీస్తూ.

(యువ దీపావళి ప్రత్యేక సంచిక - 1976)